# అనూహ్యం

మా రాజు హాస్పిటలుకు రమ్మంటే వెళ్లాను. తిరిగి వస్తూంటే బూట్లు టకటకమని వినిపించాయి. తిరిగి చూద్దును గదా ఓ చిరునవ్వు నవ్వింది నర్సు మార్గరేట్‌ను గుర్తించాను. ఆమెను కలుసుకోవటం నాకేమంత సంతోషం అనిపించలేదు.

"హలో! కులాసా?" అంది.

తల ఊపాను.

"హాస్పిటలుకు ఎందుకు వచ్చారు?"

"మా స్నేహితుడు ఇక్కడ వైద్యం చేయించుకొంటున్నాడు" అన్నాను రాజుకేసి చూపిస్తూ.

"ఏం పాపం?"

"అప్పుడప్పుడు కడుపునొప్పి వస్తుందండి" అన్నాడు రాజు. ఇక వెళతామన్నట్లు కదిలాము.

"పదండి గేటుదాకా వస్తాను" అంది ఆమె.

నాకు అయిష్టంగానే ఉంది. సభ్యత కోసం నవ్వుతూ, "ఎందుకా శ్రమ?" అన్నాను.

"నాకు శ్రమేమిటి?" అంది.

నిజమే. తనకు శ్రమేమిటి? ఎల్సీని గురించి తానెన్నో చెపుతుందనీ, అవన్నీ నాకు బాధ కలిగిస్తాయనీ తెలుసు. కాని, వినక తప్పదు.

"ఎల్సీ మీ దగ్గరికి ఎప్పుడయినా వచ్చిందా ఈ మధ్య?"

నిశ్చలంగా ముఖంకేసి చూశాను. "నా దగ్గరికి ఎందుకువస్తుంది?"

"నిజమే మీ వంటి గౌరవనీయుల దగ్గరికి వచ్చే అర్హత దానికెక్కడుంది? నాకు వాళ్ళమ్మ నాన్నలకు చాలా కళంకం తెచ్చింది. మా క్వార్టర్సులో తలెత్తుకు తిరగలేకుండా ఉన్నాను."

'తల దించుకు తిరుగు! వద్దన్న దెవరు?' అనుకున్నాను కసిగా

"వాళ్ల నాన్నకు ఈ విషయాలన్నీ బాగా తెలిసినట్లు లేదు. నేను తప్పక వ్రాస్తాను."

ఉలిక్కి పడ్డాను. ఆయన చండశాసనుడని విన్నాను. తెలిసీ తెలియని ఎల్సీ తప్పులకు ఏ శిక్ష విధిస్తాడో మరి!

"పిన్నీ, పిన్నీ అంటూ ఎంతో ప్రేమ ఒలకబోసింది. నే నెంతో అభిమానం చూపినందుకు మంచి ప్రతిఫలమే ముట్టజెప్పింది."

"ఏమయిందంటారు ఇంతకూ?"

"ఏమి కావాలో అంతా అయింది. 'అడ్డమైన మగవాళ్లతోను స్నేహం చెయ్యవద్దమ్మా. నీ జీవితం పాడవుతుంది' అని ఎంతో చెప్పి, చూశాను. కాని, వినిపించుకోలేదు. మీ వంటి గౌరవనీయులు, పెద్ద మనుష్యులు అయితే ఫరాలేదు కాని కంటికి కనిపించిన ప్రతివాడితోనూ స్నేహమే. పబ్లిక్ పార్కులో తనకు ప్రేమ ప్రదర్శనలేమిటి, బాబూ? ఎవడి తలో ఒడిలో పెట్టుకొని ప్రేమగీతాలు పాడిందని అందరూ చెబుతూంటే సిగ్గుతో చచ్చిపోయాను. ఇదేమని అడిగితే నేనెంతో సంకుచితురాలిననీ, మా ఇంట్లో ఉంటే లేని పాపాలు చుట్టుకుంటాయనీ నానా మాటలు అని వెళ్ళింది."

కోపంలో ఎల్సీ మొహం ఎంత ఎర్రబడుతుందో నాకు బాగా తెలుసు.

"మా బంధువుల అమ్మాయని ఇంతో అంతో గౌరవం ఉండేది. ఇప్పుడు బజారు స్త్రీకి ఉన్న విలువే దానికీ ఉంది ఈ ఊళ్ళో."

నా గుండెల్లో బలంగా పొడిచినట్లయింది.

"ఎల్సీతో మీకూ పరిచయం ఉందని తెలుసు. ఆ స్నేహాన్ని అట్టే పొడిగిస్తే మీ పరువు ప్రతిష్టలు బూడిద అవుతాయి. అసలు ఇంతకు తను ఎక్కడుండుదో తెలుసా?"

పాలిపోయిన ముఖంతో తెలీదని తల ఊపాను.

"ఎవరికీ చెప్పలేదు. ఎందుకు చెబుతుంది? ఎవరితోనో లేచిపోయిన బాపతాయే."

నా ముఖం ఎలా ఉందో ఊహించలేకపోయాను. ఈమె ఈసొదే ఇంతటితో ఆపితే బాగుంటుందని వాచీ చూసుకున్నాను.

నా ఇబ్బంది కనిపెట్టిన రాజు, "ప్రైమయింది, రాబర్ట్" అన్నాడు.

మార్గరెట్ తల ఊపుతూ, "స్కూలు ప్రైమయిందా అప్పుడే? మిస్టర్ రాబర్ట్స్- ఎల్సీని గురించి ఏమయినా తెలిస్తే నాకు తెలియ జెయ్యండి. మీరు మాత్రం జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ..." అంది.

"థాంక్స్" అని వడివడిగా వచ్చేశాను.

"ఏమిటోయ్ కథ," అన్నాడు రాజు పరిహాసంగా.

నా ముఖంలో ఏ భావం కనిపించిందో వాడికి. నాలిక కొరు క్కుంటూ; "సారీ నిన్ను బాధ పెట్టాలని అనలేదయ్యా" అన్నాడు.

స్కూలు చేరుకునే వరకు ఇద్దరం ఒకమాటయినా మాట్లాడుకోలేదు. ఆ రోజు అంతా చాలా బాధాకరంగా గడిచింది. సాయంకాలం ఇంటికి వెళ్ళుతూంటే రాజు భుజం మీద చెయ్యివేసి, "నే నొకటి అడుగుతాను. అపార్థం చేసుకోవు కదూ?" అన్నాడు.

"ఏమిటి?" అన్నట్లు చూశాను. వాడు అడగబోయేది ఆ మాత్రం ఊహించకపోలేదు.

"ఎల్సీ ఎవరు? ఆమెను గురించి నర్సు అంత నీచంగా చెప్పింది. ఎందుకని?"

"నాకేం తెలుసు? ఆమెనే అడిగితే పోయేదిగా!"

"క్షమించు, అబ్బాయ్. అంత కోపం దేనికి?"

"నాకు కోపం కూడానా?" అన్నాను విసురుగా.

"నీవు ఒక రహస్య మానవుడవని తెలిసీ అడగటం నాదే బుద్ధి తక్కువ. ఇంత మాత్రాన మన స్నేహం దెబ్బతింటుందనుకోకు."

ఇంతలో మేము విడిపోవలసిన సందు వచ్చింది. రాజు చెయ్యి స్నేహపూర్వకంగా నొక్కాను.

నా గది చేరుకోగానే పక్కమీద వాలిపోయాను. మగవాడికి ఏడ్చే అధికారం లేదంటారు. అలా ఏడిస్తే లోకువ కడతారు. కానీ ఎంత వేదన నాలో దాచుకోగలను? కళ్ళు మండిపోతూంటే ఎంతవరకు మగతగా పడుకున్నానో గుర్తులేదు. లైట్లు వెలగగానే కళ్ళు తెరిచాను. వెలుగు భరించలేక కళ్ళు చిట్లిస్తూ "ఎవరు?" అన్నాను.

"నేనే" అన్నాడు రాజు, రాజు మంచం దగ్గరగా వస్తూ.

"నాకు తెలుసు నీవు ఈలాగే ఉంటావని, సాయం కాలం నుండి కాఫీనీళ్లయినా తాగలేదనుకుంటానే?"

నా మొహం ఇంకోవేపు తిప్పుకున్నాను. నా భావాలన్నీ మొహం లోనే ప్రతిఫలిస్తూంటే వాడికెలా చూపను?

"ఒరే నాన్నా, ఇటు తిరుగు. నీమొహం చూస్తాను. ఇంత బెంబేలు పడితే ఎలా బాబూ? ఎంత బాధ అయినా గుండెలో దాచుకుని కుమిలిపోకపోతే, నీ స్నేహితుడితో పంచుకోరాదా? నీ ఆత్మగౌరవానికి భంగమేమోకదూ! స్నేహం చేస్తూ కూడా ఇటువంటి ఇనప తెరలు ఉంచు కోవటంలో నిన్ను మించినవారు ఉండరు."

"రాజూ, నీ నుండి దాచాలని నేను ప్రయత్నించటం లేదురా. కాని మనస్సులోని బాధ అటువంటిది. దాన్ని మాటల రూపంలో చిత్రించటం అంత సులభమేమీ కాదు."

"ముందు మొహం కడుక్కో, రాబర్ట్. హోటలుకు వెళదాము."

చల్లటి నీళ్లతో మొహం కడుక్కుంటే కాస్తహాయి అనిపించింది. భోజనం చేసేవరకు రాజు వదలేదు. ఏవో మాటలు చెబుతూ నవ్వు తున్నాడు. నేనూ అర్థంలేకుండా అప్పుడప్పుడు జీవం లేని నవ్వు నవ్వాను.

హోటలునుండి రాగానే, "సినిమాకు వెళదామా?" అన్నాడు రాజు.

"ఎల్సీని గురించి వినాలని లేదా?"

"నీకు విశ్రాంతి కావాలి, రాబర్ట్. ఎల్సీ ఎవరైనా నీ అభిమాన పాత్రురాలనీ, ఆమె హీనచరిత్రం విని కుమిలిపోతున్నావనీ తెలుసు. మర్నాడయినా ఆ సంగతి మాట్లాడుకుందాం కాని ప్రస్తుతం...."

"లేదు, రాజూ. ఈ అవకాశం జారిపోతే మళ్ళీ నీకెప్పుడూ చెప్ప లేసనిపిస్తుంది. నిన్ను మించిన స్నేహితుడు నాకెవ్వరున్నారు? చెబు తాను, విను" అని కాస్సేపు మౌనంగా ఉండి ప్రారంభించాను.

* * *

కిందటి సంవత్సరం స్కూలు తెరిచిన ఒక నెలకు కొత్తగా చేరింది సెకండరీ గ్రేడు టీచరు ఎలిజబెత్. చాలా రంగైన మొహం. లిప్‌స్టిక్ వేసుకుని బలే టిక్‌టాక్‌గా వచ్చింది. అందరూ ఆమెను వింతగా

చూశారు. అంతకుమునుపు మన స్కూల్లో లేడీ టీచర్లు లేకపోవడం ఒక కారణం కావచ్చు. నేను ఆమె విషయం పెద్దగా పట్టించుకోలేదు.

చేరిన రెండోరోజు కాబోలు, "ఎక్స్‌క్యూజ్ మీ" అని పలకరించింది.

"ఏమిటి?" అన్నాను.

"సెకండ్ ఫారం 'ఎ' సెక్షను ఎక్కడో చెబుతారా?" అంది.

ఆ డబాయింపు బడాయి చూస్తే కోపం వచ్చింది. "ఆఫీస్ ప్యూన్‌ను అడగండి" అన్నాను.

"మీరూ కొత్తగా వచ్చారా?"

'అయ్యో అమాయకురాలా!' అనుకున్నాను.

"సారీ. వెళతానండి. క్లాసెక్కడో కనుక్కోవాలి" అంది బయటికి నడుస్తూ.

"నేను చూపిస్తాను. రండి" అని ఆమెతోపాటు వెళ్ళి క్లాసుచూపించి వచ్చాను.

అవిడ చాలా కలుపుగోలు మనిషనీ, బాగా చురుకుగా ఉంటుందనీ తెలుసుకోటానికి చాలా కాలంపట్టలేదు. ఒక రోజు స్టాఫ్ రూంలో మేమిద్దరమే ఉన్నాము. ఏదో కూనిరాగం తీస్తూ పుస్తకాలు దిద్దుతూంది.

"బాగా పాటలు వచ్చా మీకు?" అన్నాను.

"బాగా రావు. కొద్దిగా వచ్చు" అంది నవ్వుతూ. చాలా ఆక్షరణీయంగా నవ్వుతుంది తను.

"పాడుతారా?"

మృదువుగా తీయగా ఓ ఇంగ్లీషు పాట పాడింది. ఆ పాట అర్థం గుండెను కదిలించి వేసింది.

"తెలుగు పాటలు రావా?" అన్నాను.

"నేను కాన్వెంటులో చదివాను. చాలా వరకు ఆంగ్లో ఇండియన్‌లా పెరిగాను."

"అందుకే కాబోలు లిప్‌స్టిక్ వేసుకోటం." వెంటనే నాలిక కొరుక్కున్నాను. అనవసరపు చనువు తీసుకున్నందుకు.

ఆమె నవ్వింది. "మానెయ్య మంటారా?"

"మీ ఇష్టం నేను తమాషాగా అన్నాను. ప్లీస్."

"ఫర్వాలేదండి" అంది.

మరుసటి రోజు తను లిప్‌స్టిక్‌తో రాలేదు!

ఆమెను గురించి మరికొన్ని వివరాలు తెలిశాయి. వాళ్ల నాన్న గారు విజయవాడలో రైల్వే ఉద్యోగి. అమ్మ చనిపోయింది. ఒక అన్నయ్య మాత్రం ఉన్నాడు, చదువు సంధ్యలు లేకుండా. వాళ్ల చుట్టాల అవిడ ఈ ఊళ్లోనే నర్సుగా పనిచేస్తూంది. ఆమె క్వార్టర్సులో ఉంటూంది ఎలిజబెత్. తమ అందిరితోనూ చనువుగా తిరిగేది కాని, నా పైన ప్రత్యేకంగా అభిమానం ఉన్నట్లు కనిపించేది. నాకు ఆ అమ్మాయి అంటే అపేక్ష కలిగిందని వేరే చెప్ప నక్కరలేదుగా.

"ఈ రోజు సాయంత్రం మా ఇంటికి రారూ?' అని అడిగింది ఒకనాడు.

"ఏం విశేషం?" అన్నాను పరీక్షగా చూస్తూ. కొత్త చీరతో బాగా ముస్తాబు చేసుకుంది.

"నా పుట్టిన రోజు."

"విష్‌యూ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అని కలచాలనం కోసం అన్నట్లు చెయ్యిచాచాను. వెంటనే నా తప్పు తెలుసుకున్నట్లు చెయ్యి వెనక్కు పెట్టుకున్నాను. ఎల్సీ వెంటనే ఆ చెయ్యిపట్టుకుంటూ "ఇచ్చిన విషెస్‌ను ఎవరైనా వెనక్కు తీసేసుకుంటారా?" అంది స్వచ్ఛంగా నవ్వుతూ.

ఆ సాయంకాలం ఒక మంచి చీర, బ్లౌజుపీసు కొని తీసుకు వెళ్లాను తనకోసమని.

మార్గరెట్‌తో ఆ రోజే పరిచయం అయింది. చాలా కలుపుగోలు మనిషి అనుకున్నాను. ఆమె ఆతిథ్యం గమనించి. "నాకు అమ్మ లేదు, రాబర్టు, కాని, ఈ అంటీ నాకా కొరత తీరుస్తూంది" అంటూ ఆమెను హత్తుకు పోయింది ఎల్సీ. ఆ అమాయకత చూస్తుంటే నా కళ్ళు చెమర్చాయి.

"ఆంటీ, వీరు హైస్కూలు టీచరయినా గర్వం కొంచెం కూడా లేదు. మా అందరితో చక్కగా మాట్లాడతారు. నాకు చాలావరకు పీరితోనే కాలక్షేపం" అని నన్ను గురించి చెప్పింది.

నేను చీర, బ్లౌజు పీసు ఇస్తే తెల్లబోయింది. "వద్దండీ. ఈ బహుమతులు నేను తీసుకోలేను."

"ఏం" అన్నాను కోపంగా.

"ఎప్పుడూ అలవాటు లేదు. ఇంకేదో గుర్తు వచ్చి బాధగా ఉంటుంది."

"బాధ ఎందుకూ?"

"...."

"నీకు నామీద ఏ మాత్రం అభిమానం ఉన్నా ఇవి తీసుకోక తప్పదు, ఎల్సీ. మీ ఇంట్లో వాళ్ళు ఇస్తే ఇలాగే తిప్పికొడతావా?" ఆమెను ఏక వచనంతో సంబోధిస్తున్నానని గ్రహించే విచక్షణ లేకపోయింది.

"కోపం వచ్చిందా, రాబర్టు? మా ఇంట్లో వాళ్ళు ఎవరూ నాకు బహుమతులు తీసుకురారు. మీ కంటే ఆత్మీయులు మాత్రం నాకు ఎవరున్నారు? అలాగే తీసుకుంటాను."

కబుర్లు అయ్యాక టీ తీసుకుని ఇంటికి వచ్చాను. ఎలిజబెత్ మాటలు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. తన స్వచ్ఛమైన నవ్వు, అమాయికత మా సారాను గుర్తు తెచ్చాయి. సారా, నేను ప్రేమ సంభాషణలు జరుపుకోలేదు కాని, చిన్నప్పటినుండి తను నాదనే భావన బాగా ఏర్పడి పోయింది. కాని, విధి బలీయం కదూ! తానెవరినో ప్రేమించానంది. వాళ్ల వివాహానికి నా సహాయాన్ని అర్థించింది. నాకు మించిన ఆప్తులు లేరు మరి! వేసవిలో నా చేతులారా తన వివాహాన్ని జరిపించాను. బంధువుల తాకిడికి తట్టుకోవటమే కాక నా మూగ బాధను కూడ భరించ వలసి వచ్చింది. అదేమీ సులభమయిన కార్యం కాదు. కాని దేవునిమీద భారం వేసి అంతా భరించాను. ఆ రాత్రి అంతా ఆలోచనతో మగతగా నిద్రపోయాను.

మరుసటి రోజు స్కూలుకు సిద్ధం అవుతూంటే ఎలిజబెత్ వచ్చింది.

"నీవా....ఎల్సీ!" అన్నాను ఆశ్చర్యంగా.

"నేనే. ఏం, మీ ఆహ్వానం లేకుండా రాకూడదా?"

"కూడదని ఎవరన్నారు? కూర్చో. బ్రహ్మచారిని అతిథి మర్యాదలు చేతగాకపోతే క్షమించు."

"మా స్నేహితురాలి ఇంటికి వెళ్ళివస్తూ దారేకదా అని వచ్చాను."

"వచ్చినందుకు సంజాయిషీ నేను అడగలేదు కాని...." ఫ్లాస్కుతో బయలుదేరబోతున్న నన్ను ఆపింది. "మీ మర్యాదలకోసం రాలేదు, రాబర్ట్. కాస్త కబుర్లు చెప్పుకోవచ్చని వచ్చాను."

"నాకు కబుర్లేమీ చేతగావు. నీ పాట వినాలని మాత్రం కోరికగా ఉంది."

విషాదంగా, తియ్యగా పాడింది.

"ఎప్పుడూ విషాద గీతాలే పాడతావేందుకు, ఎల్సీ? నిన్నంత దగాచేసిన ప్రేమికుడెవడు?"

సెలయేటి గల గలలతో నవ్వింది, "దగా చెయ్యలేదింతవరకు. చేస్తాడేమో మరి, తెలీదు."

అంతలో స్కూలుకు టయిమయింది. ఇద్దరం బయలుదేరాము.

మే మిద్దరం స్టాఫ్ రూంలో అడుగు పెట్టగానే అందరూ మావేపు వింతగా చూశారు. ఎల్సీ ఇదంతా పట్టించుకున్నట్లుగా లేదు. తనుక్లాసుకు వెళ్ళింది గబగబా.

ప్రకాశం నవ్వుతూ, "కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు. నా కర్థంగాక తెలబోయి చూశాను.

"ఏమీ తెలీనట్లు అలా చూస్తావేమిటోయ్! ఎప్పుడు నిర్ణయించుకున్నారు పెళ్ళి?"

"ఎవరిది? అన్నాను కటువుగా.

"మీదే. ఎలిజబెత్ గారిదీ, నీదీను. ఎంతయినా అదృష్టం నిన్ను వరించింది."

'ఓరి దుర్మార్గుడా!' అనుకున్నాను.

"బాబ్బాబూ, అంత కోపంగా చూడకు! ఏదో పదిమంది అనుకునేది చనువుకొద్దీ పైకి అనేశాను."

నేనేం మాట్లాడలేదు. శ్రద్ధగా కాంపోజిషన్ పుస్తకాలు దిద్దటం మొదలు పెట్టాను. ఆ రోజంతా ఎల్సీని తప్పించుకు తిరిగాను సాయం

కాలం కాఫీ తీసుకుని గది చేరుకున్నాను. ఆ రోజు జరిగిన సంఘటన లన్నీ తలుచుకుని, ఔరా! ఎంత పని అయింది!' అనుకున్నాను. నాకూ ఎల్సీకి ఏలాంటి భావమూ లేకపోవచ్చు కాని, లోకులు అలా అనుకోవ టం సహజమే మరి.

మరునాటి సాయంకాలం "ఏమండోయ్ తెగ ఆలోచిస్తున్నారు" అంటూ వచ్చింది ఎల్సీ. ఈ రోజంతా మీతో మాట్లాడటమే పడలేదు" అంది కుర్చీలాక్కుని కూర్చుంటూ.

నిట్టూర్పు అణుచుకుంటూ, "ఎల్సీ, నాగదికి ఇంక రావద్దమ్మాయ్" అన్నాను.

"ఇదేం అన్యాయం? నిన్న అయితే కాఫీ ఇచ్చి సత్కరించ బోయారు. ఈ రోజు రాగానే ఇక రానే వద్దంటున్నారు."

"లోకులు ఏమనుకుంటారో అని భయం కూడా లేదా నీకు?"

"వాళ్ళు అనుకోవటం సహజమేకాని అది అసత్య మయినప్పుడు మనకు బాధ ఎందుకు?"

"అసత్యమనేగా మరి బాధ?"

"దాన్ని సత్యంగా మారుద్దామంటారా?" అని గల గల నవ్వింది.

తెల్లబోయి చూశాను.

"అంత అలా ఆశ్చర్యపోతారేం? మిమ్మల్ని ఏమీ శ్రమ పెట్టను లెండి. నిజం చెప్పాలంటే ఈ హృదయంలో స్థానం భర్తీ అయిపోయింది. నో వెకెన్సీ." మళ్ళీ నవ్వింది.

"ఎవరా అదృష్టవంతుడు?"

"అదృష్టవంతుడా? ఏమో మరి. జేమ్సు ఆ మాట ఒప్పు కోవాలిగా?"

"ఏం చేస్తుంటారాయన?"

"విజయవాడ రైల్వే హాస్పిటల్‌లో మేల్ నర్సు."

"మరింకేం? త్వరగా శుభకార్యం కానివ్వరాదూ."

"నయమే. మానాన్నగారికి అసలు ఇష్టం లేదు. చూడాలి, ఎప్పుడు కాలం అనుకూలిస్తుందో."

"మీ నాన్నగారికి ఎందుకు ఇష్టంలేదు?"

"ఆయనో చండశాసనుడు. జేమ్సు కాథలిక్. నేను ప్రొటెస్టెంటును. ఎలా ఒప్పుకుంటారు. నాన్నగారు?"

"మీ పరిచయం?...."

"నాన్నకు తెలుసు. అందుకే చాలా కట్టుదిట్టాల్లో ఉంచారు."

"ఇక్కడికి వచ్చేముందు జేమ్సును కలుసుకున్నావా?"

"ఆఁ, అప్పటికి తనకు జ్వరంగా ఉంది. హాస్పిటల్‌లోనే ఉన్నారు. నన్ను చూడగానే కన్నీళ్ళతో, 'ఎల్సీ! నీ కోసమయినా బతుకుతాను. నన్నెన్నటికీ వదలనని హామీ ఇయ్యి" అన్నారు. నేను ఆయన చేతిలో చెయ్యివేసి వచ్చాను."

"మీ నాన్నగారు ఒప్పుకోకపోతే పెళ్ళి ఎలా జరుగుతుంది?"

"ప్రపంచంలో అన్నీ అందరి అంగీకారాలతోను జరుగు తున్నాయా?"

జేమ్సుకు మనిద్దరి స్నేహాన్ని గురించి తెలిస్తే అనుమానం రాదూ?"

"పోనీ. నన్నంత త్వరలో అనుమానించే వ్యక్తి పెళ్ళిచేసుకుని మాత్రం ఏమి సుఖపడతారు?"

"ఏమిటబ్బా ఈవిడ స్వభావము!" అని ఆశ్చర్యపోయాను.

మరుసటి రోజు స్టాఫ్ రూంలో ఏదో గొడవ పడుతున్నారు. ఏమిటా అని విచారిస్తే ప్రకాశానికి విరిగిన కుర్చీ వేశారట. ఆయన మామూలుగా కూర్చునేసరికి కింద పడ్డారట!

"ఎవరో ఈ పని కావాలనే చేశారు" అన్నారు ప్రకాశం నావేపు గుర్రుగా చూస్తూ.

"ఇంకెవరు? ఆ ఎలిజబెత్‌గారు చేసి ఉంటారు" అన్నాడు నారాయణరావు.

"ఆమె నేమయినా అంటే రాబర్టుకు కోపం వస్తుందండోయ్" అని పకపక నవ్వాడు దీనదయాళ్.

అందరూ ఆయనతో శ్రుతి కలిపారు.

నాకు నిజంగా కోపం వచ్చింది. "తెలిసీ తెలియక ఎలిజబెత్ మీద నిందారోపణచేస్తే నా కెందుకు కోపం రాదు? ఆమె స్నేహితునిగా కోపం వస్తేమాత్రం అసహజం ఏముంది." అన్నాను.

"ఊరుకోండి బాబూ. మరీ చిన్నపిల్లలవుతున్నారు" అని తెలుగు మాస్టారు సర్ది చెప్పారు.

ఆ రాత్రి ఏమీ తోచక సినిమాకు వెళ్ళాను. థియేటర్లో ఎల్సీ కనిపించింది. ఆమెతోకూడా ఒక యువకుడు కూర్చుని ఉన్నాడు. ఇద్దరూ ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ సినిమా చూస్తూ ఆనందిస్తున్నారు. ఇంటర్వెల్‌లో నన్ను చూసి చిరునవ్వు నవ్వింది. సినిమా పూర్తికాగానే గబాగబా నా దగ్గరికివచ్చి, "మీరు సినిమాకు వస్తున్నట్లు చెప్పలేదే?" అంది.

"నీవు మాత్రం చెప్పావా?"

"వస్తావని నే ననుకోలేదు. ఇదిగో, వీరే జేమ్సు. సాయంకాలం ఇంటికి వెళ్ళగానే దర్శనం ఇచ్చారు."

"రేపు స్కూలుకు నాగాయేనా?"

"తప్పక జేమ్సు ఉండగా స్కూలెందుకు?" అని నవ్వింది. ఇంతకూ జేమ్సు ఒక మాటయినా మాట్లాడలేదు. వెళ్ళేటప్పుడు మాత్రం "వస్తానండీ" అన్నాడు.

రెండు రోజుల తరవాత తను, జేమ్సు కలిసి తీయించుకున్న ఫోటో చూపించింది.

"చాలా బాగుంది. నీ మొహం మరీ ఆనందంతో పొంగిపోతూంది. ఈ ఫోటో నేను మీ నాన్నగారికి పంపితే ఏమవుతుంది?"

"పంపి చూడండి" అని నవ్వింది.

ఆ ఫోటో పదిలంగా ఆల్బంలో దాచుకున్నాను. తను అడ్డు చెప్పలేదు.

పదిహేను రోజుల తరవాత, ఓ ఆదివారం భోజనమయ్యాక చిన్న కునుకు తీస్తున్నాను. నన్నెవరో తట్టినట్లయింది. చూద్దునుగదా ఎల్సీ. కళ్లు ఎర్రబడి వాచాయి. నా నిద్రమత్తు తొలగిపోయింది. చన్నీళ్ళు మొహం మీద పోసుకుని త్వరత్వరగా వచ్చాను. "ఏమిటి, ఎల్సీ?"

"రాబర్ట్, నా సర్వస్వం నాశనమయింది. నే నెందుకింకా బ్రతుకుతున్నానో అర్థకాలేదు." అంది వచ్చే ఏడుపు ఆపటానికి ప్రయత్నిస్తూ.

ఆమె కళ్ళలో వింత వెలుగును, పెదవులపై దరహాసాన్ని మాత్రమే చూసిన నేను ఈ దీనమూర్తిని చూసిచలించిపోయాను. ఆమెను ఓదారుస్తూ అనునయిస్తూ ఏమిటి సంగతి అని అడిగాను. చేతిలోని ఎక్స్ప్రెస్ డెలివరీ ఉత్తరం ఇచ్చింది.

"డియర్ ఎల్సీ,

నీనుండి ఉత్తరాలే రాలేదని డాడి కంగారు పడుతున్నారు. అన్నట్లు నీ బాయ్ ఫ్రెండు జేమ్సుకు పెళ్లి స్థిరపడిందనీ, రేపు నెలలో వివాహమనీ విన్నాను. నాన్నగారికి ఈ విషయం తెలిసి నీకు వ్రాయమన్నారు. అతనికి నీవు ఉత్తరాలు వ్రాయకూడదని చెప్పమన్నారు.

ఆంటీని అడిగినట్లు చెప్పు. త్వరలో నీవిక్కడికి వస్తే బాగుంటుంది.

ప్రేమతో

జాన్."

"మీ అన్నయ్య వ్రాశాడా?"

అవునని తల ఊపింది.

"జేమ్సు నిజంగా అంతపనీ చేశాడా?"

"నేను నమ్మలేను, రాబర్ట్. ఆయనపై విరక్తి పుట్టించాలని అలా వ్రాశాడేమో అన్నయ్య?"

"నీకు నిజం ఎలా తెలుస్తుంది, ఎల్సీ?"

నా కెలా తెలుస్తుంది? జేమ్సు వెళ్లినప్పటి నుండి ఉత్తరాలు వ్రాయటం లేదు.

"నీవు ఇంటికి వెళ్లి రారాదూ?"

"ఊహు, నేను వెళ్లను. అక్కడ పెళ్లిప్రయత్నాలు జరుగుతూంటాయి. నా కంఠంలో ప్రాణం ఉండగా జేమ్సునుగాక ఎవ్వరినీ చేసుకోను."

ఆ విషయం తను చెప్పకుండానే గ్రహించాను.

"నేను విజయవాడ వెళ్లి రానా?"

"మీరా?" అంది ఆశ్చర్యపోతూ.

"ఏం వెడితే?"

"మీరు వెళితే నిజం తెలుస్తుంది. కాని....నిజంగానే జేమ్సు ఇంకొకరి సౌ త్రయ్యే పక్షంలో ఆ నిజం తెలుసుకోవాలని లేదు."

"ఎన్ని రోజులు ఇలా మభ్యపెట్టుకుంటావు?"

సమాధానం కన్నీళ్ళే.

మరునాడే విజయవాడ వెళ్ళాను. జేమ్సును కలుసుకోవటం కష్టమనిపించలేదు.

"హలో! మీరా." అన్నాడు చిరునవ్వుతో.

"గుర్తున్నానా?"

"మిమ్మల్ని మరచిపోవటమా?"

"ఏమంత ప్రత్యేకత?.... ఎల్సీ మిమ్మల్ని కొన్ని విషయాలు అడిగి రమ్మని పంపింది."

"ఏమిటని?"

"మీకు ఎవరితోనో పెళ్లి స్థిరపడినట్లు విన్నది. చాలా బాధ పడుతూంది, నిజం తెలుసుకు రమ్మని పంపింది."

"మీరిద్దరూ బాగా చనువుగా ఉంటారు కదూ!"

సమాధానంగా చిరునవ్వు నవ్వాను.

"ఎల్సీ బలే ఆకర్షిస్తుంది మనుష్యుల్ని."

". . ."

"ఇంతకూ పెళ్లి స్థిరపరచడం జరిగిందని చెబితే తనేంచేస్తుందిట?"

"ఇదేం ప్రశ్న? తను అసలు పెళ్ళి ఎలా చేసుకుంటుంది?"

"నిజమే. కాని నా వివాహం స్థిరపడలేదు."

"సో గ్లాడ్" అంటూ కరచాలనం చేశాను.

"మీరు ఉత్తరాలు వ్రాయటం లేదటగా?"

"ఊహుఁ."

"ఎందుకు మానేశారు? తను ఎంత బాధపడుతూందో మీకుతేలీదా?"

ఓ ప్రశ్న అడుగుతాను, నిజం చెప్పండి. ఎల్సీకి మీవంటి స్నేహితులు ఎందరున్నారు?"

ఒక్కసారి స్తబ్దుణ్ణి అయ్యాను.

"మొన్న ఏలూరు వచ్చినప్పుడు నా స్నేహితుణ్ణి కలుసుకున్నాను.

వాడు ఎన్నో విషయాలు చెప్పాడు. వాడూ జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు."

"ఏం చెప్పాడు?"

"మీకు కుతూహలం ఉండటం సహజమే. ఎల్సీ ఏలూరు మొత్తంలో పేరు తెచ్చుకున్నదట. ఎప్పుడూ సినిమాలు, షికార్లు! బోలెడంత మంది స్నేహితులట! హాస్పిటల్లో అందరూ తన స్నేహితులేనటగా?"

"ఎల్సీ ఎంత కలుపుగోలు మనిషో, ఎంత సహృదయో మీకు తెలిసీ...."

"ఆమె హృదయం మీకు తెలిసినంతగా నాకు తేలీదు లెండి."

"మీరెన్ని మాటలన్నా పడతా గాని ఎల్సీ విషయంలో అనుమానానికి తావివ్వకండి. తను మాలిన్యం లేని మాణిక్యం."

"మిస్టర్, ఆ మాణిక్యాన్ని మీరే ఉంచుకోండి గాని ఆ విషయాలేవీ నాతో ఇక మాట్లాడవద్దు. ఎక్స్‌క్యూజ్ మీ" అని లేచి నిలబడ్డాడు. అక్కడ ఇంకొక క్షణమయినా ఆగాలనిపించలేదు. ఈ సంఘటన గూర్చి ఎల్సీకి చెప్పలేదు.

ఇప్పటికే నా పేరు, ఎల్సీ పేరు ప్రచారంలో ఉందని తెలుసు. నా స్నేహమే తన వైవాహిక జీవితానికి అవరోధాలు కల్పించిందా అని కుమిలిపోయాను. ఆనాడు గట్టిగా చెప్పాను ఎల్సీతో; "నీ వెప్పటికీ నా గదికి రాకు. నాతో మాట్లాడకు." నిర్లిప్తంగా నవ్వింది. "నా పరువు ప్రతిష్ఠలు మీదాకా పాకాయన్న మాట. ఒక మార్గరెట్ దృష్టిలోనే నేను పతితురాలి ననుకున్నాను. నిజమే, నాతో తిరిగితే సంఘంలో మీ ప్రతిష్ఠకు భంగం రాదూ!" నోటి నుండి మాట రావటానికి కాసేపు పట్టింది.

"నేను మగవాణ్ణి, ఎల్సీ. ఏంచేసినా చెల్లుతుంది మన దేశంలో. అదే నిన్ను గురించి అబద్ధాలు ప్రచారంలోకివస్తే జీవితం సుడిగుండంలో చిక్కుకొంటుంది."

నవ్వింది వేదాంత ధోరణిలో. "ఈపరమసత్యాలన్నీ నాకూతెలుసు."

"మరి ఎందుకు పాటించవు?"

"అన్నిటినీ మించి నా ఆత్మ సాక్షి ఉంది. పైన ప్రభువున్నారు. ఇంకెవర్నీ నేను లక్ష్యపెట్టను."

"జీవితానుభవం లేకుండా మాట్లాడుతున్నావు! ఆవేశంలో నీవనుకునే ఆదర్శాలు నీ జీవితంలో తుఫాను రేపుతాయి! నా మాట విను, ఎల్సీ. నాకంటే నీ మేలు కోరేవారు ఎవరూ లేరు."

"ఇక్కడికి రావద్దంటారు. అంతేనా."

"........"

"మంచిదే. వెళతాను. నన్ను మరిచిపోకండి." కన్నీళ్ళు ఆపుకుంటూ త్వరగా వెళ్ళిపోయింది.

ఆ రాత్రి నాకు భయంకరంగా గడిచింది. మూడు రోజులు సెలవుపెట్టి ఇంటికి వెళ్ళాను. గదికి రాగానే లోకల్ పోస్టులో వచ్చిన ఉత్తరం కనిపించింది.

"రాబర్ట్,

నేను వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో చెప్పలేను. ఏ మారుమూలో మిగిలిన రోజులు గడిపెయ్యాలని ఉంది. చిరునవ్వుముఖాల వెనక విషం దాగి ఉంటుందని తెలుసుకొని అప్రతిభురాలినయ్యాను. నేను చేసిన పాపం.... స్నేహపూర్ణ హృదయం కలిగి ఉండటమే. దానికి పర్యవసానం.... మార్గరేటును కలుసుకోండి. రసవత్తరంగా వినిపిస్తుంది.

సెలవు,

ఎల్సీ."

స్కూలుకు వెళ్ళగానే అందరూ ఆశ్చర్యపోతున్నట్లుగా, "ఎలిజబెత్‌గారు ఇంక ఉద్యోగం చెయ్యరా?" అని నన్ను అడిగారు.

"నాకేం తెలుసు?"

"అయితే మీరిద్దరూ పెళ్ళిచేసుకోవటానికి వెళ్ళలేదా?" దీనదయాళ్ ప్రశ్న.

లాగి చెంపకు పెట్టాలనిపించింది.

"సారీ.... మిస్టర్" అని వెళ్ళిపోయాడు.

ఎన్నో రోజులు ఎల్సీని గురించి ఆలోచించాను. నిశ్శబ్దంగా కన్నీళ్ళు కార్చాను. నిర్మలహృదయంతో నవ్వే నా ఎల్సీ ఏనాటికీ మార్గరేట్ చిత్రించిన వ్యక్తి కాదని నాకు బాగా తెలుసు.

* * *

అప్పటికే తెల్లవారింది. రాజు నిట్టూరుస్తూ, "ఆమె ఎక్కడుందో తెలుసుకో, రాబర్ట్" అన్నాడు.

"తెలుసుకొని....?"

"నే నొక సలహా ఇస్తానుగాని అపార్థం చేసుకోవుగదా?"

"........"

"ఎల్సీని పెళ్ళిచేసుకో."

నవ్వాను. "ఇంకా ఎల్సీ నీకర్థం కాలేదా? జేమ్సును గాక తనెవ్వరినీ చేసుకోదు. అదే ఆ స్త్రీలోని రహస్యం. నీకూ నాకూ అనూహ్యం."